క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల పనుల్లో భాగంగా శనివారం చిలకలూరిపేట రూరల్, యడ్లపాడు మండలాల్లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో చిలకలూరిపేట డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ చెప్పారు. రూరల్ మండలంలో పసుమర్రు, మురికిపూడి, బొప్పూడి గ్రామాలు, అలాగే యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వినుకొండ: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి జన్మదినం పురస్కరించుకుని అర్చకులు పొట్టి శ్రీనివాసరావు, రాంబాబు తెల్లవారుజాము నుంచి పంచామృతాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

వినుకొండ కమిషనర్‌కు సన్మానం

వినుకొండ: శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పురపాలక సంఘం కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వినుకొండ పట్టణంలో పన్ను వసూళ్లల్లో ప్రథమస్థానంలో నిలిపినందుకు గాను మంత్రి చేతుల మీదుగా అవార్డు పొందడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జాజుల మాల్యాద్రి, కనువాల వెంకటేశ్వర్లు, శివకుమార్, కృష్ణవేణి, రమాదేవి, తారక్, పిచ్చయ్య పాల్గొన్నారు.

21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రొంపిచర్ల : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 20వ తేదీ నిర్వహించాల్సిన 6వ తరగతి ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఆ రోజు పర్వదినం కావటంతో ప్రభుత్వం ఆ పరీక్షను మరుసటి రోజుకు వాయిదా వేసిందన్నారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్‌ను దగ్గర్లో ఉన్న నెట్, మీసేవా సెంటర్‌ల ద్వారా పొందవచ్చు అన్నారు. విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, ప్యాడ్, మంచి నీళ్ల బాటిళ్లు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్స్ పరికరాలు అనుమతించబడవన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షా తేదీ మార్పును గమనించాలన్నారు.

రెండవ రోజు ఘనంగా ప్రతిష్టా కార్యక్రమాలు

రొంపిచర్ల: స్థానిక శ్రీ అంకమ్మతల్లి పోతురాజు స్వామి వార్ల దేవాలయంలో శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నిత్య పూజా నిధి, వాస్తు పూజా, వాస్తు హోమం, దేవతా మూర్తులకు క్షీరాధి వాసం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటలకు ఆలయ ప్రదక్షిణ పూర్వక శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించ నున్నారు. అదే రోజు అన్నదాన కార్యక్రమం కూడా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గణపవరంలో ఆక్రమణల తొలగింపు



నాదెండ్ల: గణపవరం గ్రామంలోని గ్రంథాలయం సమీపంలో ఆక్రమణలను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. హోటల్, సెల్‌షాపు, సైకిల్ షాపులను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబు మాట్లాడుతూ 2018లో గ్రామస్తులకు తాగునీటి సరఫరా నిమిత్తం ఎన్టీ ఆర్ సుజల స్రవంతి పథకం క్రింద ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అయితే పథకం అమలు కాకపోవటంతో ట్యాంక్ నిరుపయోగంగా ఉందన్నారు. ప్రస్తుతం పథకాన్ని పునః ప్రారంభిస్తున్నందున ట్యాంక్‌ను శుభ్రం చేసి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ట్యాంక్ చుట్టూ పంచాయతీ స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను తొలగించామని వివరించారు.

భిక్షాటన చేసి.. పాలకుల తీరుని ఎండగట్టి...

- వినూత్న రీతిలో నిరసన తెలిపిన పారిశుద్ధ్య కార్మికులు
- దీక్షా శిబిరంలో పూలేకు నివాళి



శిబిరంలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్మికులు

నరసరావుపేట: నెలరోజుల పాటు పూర్తిగా పనిచేస్తే 10 నుంచి 15 రోజులకు వేతనాలు ఇస్తే తమ కుటుంబాలను భిక్షాటన చేసి పోషించుకోవాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో వినూత్న రీతిలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఆప్కాస్‌లో నమోదైనా తమపై వివక్ష ఎందుకని, నెల మొత్తం పనిచేసినా పూర్తివేతనాలు ఇవ్వడం లేదని, అరకొర వేతనాలతో కుటుంబాలు ఎలా గడవాలని మున్సిపల్ పారిశుద్ధ్య బదిలీ కార్మికులు వాపోయారు. పని చేసినన్ని రోజులు వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 23వ రోజుకు చేరుకున్నాయి. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల కోసం పాటుపడిన మహనీయులు పూలే ఆశయాలకు పాలకపక్షాలు తూట్లు పొడుస్తున్నారన్నారు. పూలే స్ఫూర్తితో పోరాడి హక్కులు సాధించుకుందామన్నారు. ఆరేళ్లగా విధులు నిర్వహిస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు పనిచేసిన అన్ని దినాలకు వేతనాలు ఇవ్వడం లేదని, మిగతా కార్మికులతో పాటు ఎనిమిది గంటలు పనిచేస్తున్నా అవుట్ సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో నమోదైనా వివక్ష తగదన్నారు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఇచ్చే వేతనాలతో తమ ఇంటిల్లిపాది ప్రతిరోజు ఇదేవిధంగా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు తీరు మారకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేయడానికి వెనకాడబోమని కార్మికులు హెచ్చరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వచ్చి న్యాయం చేసేవరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్మికులు జొన్నలగడ్డ వీరమ్మ, సమాధానం, సెల్వి, లత, నాగమణి, శ్రీను, చంద్రయ్య, రాజు, ఖాదర్‌వలీ, వీరయ్య, సాంబయ్య, అబ్రహం, సాల్మన్, దేవా, జీవరత్నం, వీర కుమార్, నవీన్ పాల్గొన్నారు.

పశువుల తొట్ల నిర్మాణ పనులు వేగవంతం కావాలి

ఏపీడీ బూసిరెడ్డి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఉపాధి అధికారులు

ఈపూరు(శావల్యాపురం): వేసవిలో పశుపక్షాదులు దాహార్తి బారిన పడకుండా నియంత్రణ చేయడానికి పశువుల తొట్లు ఎంతోగానో దోహదపడతాయని ఉపాధి పథకం ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి అన్నారు. శుక్రవారం గోపువారిపాలెం గ్రామంలో నిర్మించుతున్న పశువుల తొట్టి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈసందర్భంగా ఏపీడీ బూసిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నీటి వసతి ఉన్న ఏరియాల్లో ప్రాధాన్యత మేరకు శావల్యాపురం మండలం-14, బొల్లాపల్లి-19, ఈపూరు-05, నూజెండ్ల-06, వినుకొండ రూరల్ మండలం-20 పశువులు తొట్ల నిర్మాణ పనులు చేయటానికి ఉపాధి పథకం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో తొట్టి నిర్మాణ పనులకు రూ.35 వేలు నిధులు మంజూరు చేస్తామన్నారు. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 2 అడుగుల ఎత్తు కొలతలు కల్గిన ఉన్న పశువుల తోట్లు నిర్మాణ పనులు పురోగతి పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు ఏపీవో పుష్పరాజ్, టీఏ నారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంయూ ధర్నా కార్యక్రమం



ధర్నాలో పాల్గొన్న ఎన్‌ఎంయూ నాయకులు

వినుకొండ: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వినుకొండ డిపో గ్యారేజీ గేటు ఎదుట వరుసగా రెండో రోజు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి డిపో గౌరవ అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి కమిటీ చైర్మన్ పీవీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో చాలా మంది ఉద్యోగులు 50 ఏళ్ల పైబడిన వారికి సరైన వైద్యం అందడం లేదని, పెండింగ్ డీఏలు ఇంతవరకు చెల్లించలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీలో ప్రయాణం అనుమతించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భత్యం పెంచాలని, 1 2019 సర్క్యులర్ అమలు పరచాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ పనిష్మెంట్లు నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.

పై సమస్యలు పరిష్కరించని యెడల అవసరమైతే సమ్మెకు దిగుతామని డిపో అధ్యక్షులు సొభాగ్యరాజు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వి.ఎస్.పి నాయక్, ముప్పాళ్ళ శ్రీను, వైవి ఆంజనేయులు, కె.ఆదెయ్య, హరిహరబాబు, కఠారి, డీఎస్ శేషగిరి, గ్యాస్ వలి, ఎం.కె జి ఎన్ రావు, ఎస్.ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ దాడులు

రూ.4.13 లక్షల అపరాధ రుసుం



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

బొల్లాపల్లి : విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీపీఈ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సంయుక్తంగా సీహెచ్. వెంకటేశ్వరరావు, సీహెచ్. రాంబోట్ల తెలిపారు. మండలంలో రేమిడిచర్ల సెక్షన్ పరిధిలో చక్రాయపాలెం, హనుమాపురం, గరికపాడు, పమిడిపాడు, పాపాయపాలెం, గుమ్మనంపాడు, మేళ్లవాగు తదితర గ్రామాల్లో విద్యుత్ సర్వీసుల తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చట్టానికి లోబడే సర్వీసులు తనిఖీలు చేస్తారని తెలిపారు. ఈ తనిఖీల్లో 38 బృందాలు, 38 అధికారుల 114మంది సిబ్బంది 1477 సర్వీసులను తనిఖీ చేశారని తెలిపారు. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, కేటగిరికి మించి విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, అదనంగా విద్యుత్ వాడుతున్న తదితర చౌర్యానికి పాల్పడుతున్న విద్యుత్ సర్వీసులను తనిఖీలు నిర్వహించి రూ.4.13 లక్షల అపరాధరుసుము విధించామన్నారు. ఈ తనిఖీల్లో పల్నాడు జిల్లా పర్యవేక్ష ఇంజనీర్ పి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ విభాగం, అపరేషన్ విభాగం తనిఖీ నిర్వహించడమైందన్నారు. ఈ తనిఖీల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, ఏఈలు టి.శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు, ఎం. సతీష్‌కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ బి.రామాంజనేయులు నాయక్, ఆపరేషన్ డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అపరిష్కృత ఫిర్యాదులపై విచారణ



ఫిర్యాదుదారులను విచారిస్తున్న సుబ్బారావు

నూజెండ్ల: గ్రీవెన్సుడేలో అపరిష్కృతంగా మిగిలిపోయిన ఫిర్యాదులపై ప్రత్యేకాధికారి వరదా సుబ్బారావు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాలతో చేపట్టిన విచారణలో ఫిర్యాదుదారులను ప్రత్యక్షంగానూ, అందుబాటులో లేనివారిని ఫోన్ ద్వారా సంప్రదించారు. రెవెన్యు 4, పోలీస్ శాఖలో 3, మండల పరిషత్‌లో 3 మిగతావి ఇతర శాఖల్లో మొత్తం 12 పరిష్కారం కాని దరఖాస్తులుగా గుర్తించటం జరిగిందన్నారు. కాన్సరుతో భర్తకు గొంతు ఆపరేషన్ జరిగిందని పెన్షన్ సౌకర్యం కల్పించాలని మారెళ్ళవారిపాలెంకు చెందిన మహిళ చేసుకున్న దరఖాస్తు ను విచారించారు. అలాగే భూమిని ఆన్‌లైన్ లో ఎక్కించాలంటూ వచ్చిన ఫిర్యాదులపై దరఖాస్తుదారులను ఫోన్‌లో సమాచారం అడిగి తెలుసుకున్నారు. 2014-15లో చేపట్టిన అభివృద్ధి పనుల 70 లక్షల పెండింగ్ బిల్లుల ఫిర్యాదుదారు నంబుల గుర్నాదంతో మాట్లాడారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వరదా సుబ్బారావు అన్నారు. విచారణ కార్యక్రమంలో తహసీల్దారు రమేష్ కుమార్, ఎస్సై యంవీ కృష్ణారావు, ఏఈ అల్లాభక్షు ఉన్నారు.

యువకులు సామాజిక సేవల్లో పాల్గొనాలి

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట రూరల్: యువకులు రక్తదానం వంటి సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కాకానిలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ రక్తం కృతిమంగా లభించదని, మనిషికి అవసరమైన రక్తాన్ని కేవలం మనిషి మాత్రమే దానం చేయగలరని తెలిపారు. రక్తదానం చేయడానికి, స్వీకరించడానికి కులం, మతం, వర్గం, పారంతం అనే తారతమ్యం లేదన్నారు. రక్తదానం చేసే వారికి రెడ్‌క్రాస్ ప్రశంసా పత్రాలను అందజేస్తుందని తెలిపారు. ఉద్యోగ సాధనలో విద్యార్థులకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న వారు రక్తదానం చేయడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. బ్లడ్ బ్యాంక్‌లో నిలువ తక్కువగా ఉన్నందున రెడ్‌క్రాస్ అడిగిన వెంటనే శిబిరం ఏర్పాటుకు సహకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.ఎం.యస్.వి. శ్రీనివాస గుప్తా, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ బైక్‌ల దొంగ అరెస్ట్

17 బైక్‌లు స్వాధీనం



చిలకలూరిపేట: మోటార్ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అర్బన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పట్టణం జాలయ్యకాలనీకి చెందిన మాచర్ల ఏసు ఎలియాస్ వేణు దురలవాట్లకు బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. శుక్రవారం పట్టణ పోలీసులు ఏఎంసీ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్కూటీపై వస్తూ పోలీసులను చూసి వెనుక్కు తిరిగి వెళుతున్న క్రమంలో వెంబడించి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి వివిధ ప్రాంతాలలో దొంగిలించిన 17 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై మార్టూరు, బల్లికురవ, అద్దంకి పోలీస్ స్టేషన్లలో బైక్ దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. సమావేశంలో పట్టణ ఎస్ఐ డి.చెన్నకేశవులు, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, వలి సిబ్బంది పాల్గొన్నారు.

కొండవీడు కళాపరిషత్‌లో నేటి కార్యక్రమాలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో కొండవీడు కళాపరిషత్ ఆధ్వర్యంలో 26వ జాతీయస్థాయి నాటికలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 12,13,14 తేదీల్లో మూడు రోజులు జరిగే పోటీలకు నంబంధించి స్థానిక జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలోని పోసాని సుబ్బారావుచౌదరి స్మారక కళావేదికపై తొలిరోజు కార్యక్రమాలను కమిటీ అధ్యక్షులు కట్టా శ్రీహరి రావు, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, నంబూరు వీరాంజనేయులు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివరామకృష్ణ, నంబూరు ఉల్లయ్య, జరుగుల రామారావు వెల్లడించారు.

మహాకవి కాళిదాసు కళా ప్రాంగణంలో..

- రాత్రి 8: 45 గంటలకు..సౌజన్య కళా స్రవంతి(ఉత్తరాంధ్ర) వారి 'దేవరాగం' నాటిక మూల కథ సలీం, నాటకీకరణ-దర్శకత్వం కే కే ఎల్ స్వామి,
- 10 గంటలకు..సభా కార్యక్రమం
- 10 45 గంటలకు..ఉషోదయ కళానికేతన్(కట్రపాడు) వారి 'కిడ్నాప్' నాటిక రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు
- 11:45 గంటలకు..అమరావతి ఆర్ట్స్(గుంటూరు) వారి 'చిగురు మేఘం' నాటిక రచన కావూరి సత్యనారాయణ, దర్శకత్వం ఏపూరి హరిబాబు

నివేశన స్థలాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు

శావల్యాపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో అర్హత కల్గిన యున్న లబ్ధిదారులందరు ఇంటి నివేశిత స్థలాలు గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకుల సంప్రదించి ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ నమోదు చేయించాలని హౌసింగ్ డీఈ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఈ శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ శావల్యాపురం మండలం-713, ఈపూరు-1050, బొల్లాపల్లి-1243, నూజెండ్ల-246, వినుకొండ రూరల్- 650 మంది లబ్ధిదారులందరు సచివాలయంలోని రెవెన్యూ అధికారులు ఆమోదించిన ఇంటి నివేశిత స్థల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తానే పథకానికి అర్హత పొందుతారన్నారు. ఇంటి సరిహద్దులతో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ అనుమతులు మంజూరు చేసిందన్నారు. రూ.2 లక్షల 50 వేల మంజూరు చేస్తామన్నారు. అలాగే గతంలో అసంపూర్తిగా నిర్మించిన గృహాలకు సంబంధించిన లబ్ధిదారులు ఎస్సీ, బీసీ వర్గాలకు వారికి రూ.50 వేలు ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేస్తామన్నారు. అర్హత కల్గి యున్న లబ్ధిదారులందరు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించాలన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

నరసరావుపేట రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తే ఆయా కుటుంబాలు వెలుగులోకి వస్తాయని జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటరమణ తెలిపారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని కోటప్పకొండలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఆర్థిక స్వావలంబనలో మహిళలు పాత్ర అనే అంశంపై జిల్లాస్థాయి సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ చిన్న పాటి పొదుపులతో ప్రారంభమయ్యే స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్న మహిళలకు భవిష్యత్‌పై ఆశను నింపుతున్నాయని తెలిపారు. సహకార సంఘాలు సభ్యుల శ్రమ, నమ్మకం, పరస్పర సహాయంపై ఆధారపడి పని చేస్తాయని తెలిపారు. సహకార, పొదుపు సంఘాల పరస్పర సహకారాలతో మహిళలు తక్షణ అవసరాలు తీర్చుకునే సామర్థ్యం కలిగి, అప్పుల జాబితాలో పడకుండా ఉంటారని పేర్కొన్నారు. పొదుపు సంఘాల నిర్వహించే సమావేశాల ద్వారా ఖర్చులు ఎలా నిర్వహించాలి, పొదుపు చేసే మార్గాలను మహిళలు తెలుసుకోవచ్చని తెలిపారు. పాస్ బుక్, లావాదేవీలు, లెక్కల నిర్వహణ వంటి సామాన్య బ్యాంకింగ్ ప్రక్రియలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ సంఘాల ద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు, డీపీఎం హనుమనాయక్, ఏపీఎంలు జగజ్జీవన్, భరత్, స్త్రీ నిధి ఏజీఎం చిన్న బుల్లయ్య పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై ఆసక్తి చూపాలి

యడ్లపాడు: పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి పెట్టాలని డీప్యూటీ సీఎంవో కార్యాలయం ప్లాంటేషన్ విభాగం జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్ పేర్కొన్నారు. యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామం పరిధిలో ఉపాధి హామీ పథకం ఉద్యాన విభాగంలో వివిధ పండ్లు, పూలతోటలను సాగు చేస్తున్న వాటిని క్షేత్రస్థాయిలో సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం నరసరావుపేట క్లస్టర్ ఏపీడీ హీరాలాల్, పల్నాడు జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శిరీష, యడ్లపాడు ఏపీవో డి సుందరరావు, టీఏ మాధవి, జేఈ వీరయ్య, ఉపాధి హామీ పథకం సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని అలవాల అచ్చయ్యపాలెం శివారు పరిధిలోని మృత్యుంజయపురంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లను శనివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ప్రధాన అర్చకులు మణికంఠ శర్మ శుక్రవారం తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం

యడ్లపాడు: స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి సర్వీసు మార్గంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీలో శుక్రవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. సమీప నివాసితులు భయాందోళనకు గురై చిలకలూరిపేట అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం సంఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పివేసింది.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



వినుకొండలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత జ్యోతిరావుపూలేకే దక్కుతుందన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు కోనేటి నరసింహారావు, ముక్కడాల వెంకటేశ్వరరావు, జమ్ములమడుగు హనుమయ్య, గుంజి పేరయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

చిలకలూరిపేట: దేశాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక రుగ్మతలపై పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. ముందుగా గడియార స్తంభం సెంటర్‌లోని జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, విశ్రాంత న్యాయమూర్తి కంచర్ల విజయకుమార్, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, షేక్ దరియావలి, గోపతోటి జాన్, బండారు జయకుమార్, మైలా రాజేష్, సాపా సైదావలి తదితరులు పాల్గొన్నారు.

గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో...

గార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయంలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. కార్రక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సంస్థ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, కార్యదర్శి పి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో సంఘ నాయకులు పోటు శ్రీనివాసరావు, సీహెచ్ వీరయ్య,మేకల పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాభివృద్ధికి తోడ్పాటు

బొల్లాపల్లి : గిరిజన సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ధర్తి ఆబ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో గిరిజన నివాస ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య తెలిపారు. మండలంలోని కనుమల చెరువు పంచాయతీ పరిధిలో బ్రిడ్జి తండాలో ఈ పథకం గురించి గిరిజనులకు అవగాహన కల్పించారు. మండలంలో అయ్యన్నపాలెం పంచాయతీ పరిధిలోని పాపాయపాలెం, కనుమల చెరువు పంచాయతీలోని బ్రిడ్జితండా, మూడుతూముల తండాను ఈ పథకం కింద ఎంపిక చేశామన్నారు. ప్రధానంగా గిరిజనులు నివాసం ఉండే ప్రాంతాల్లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, గృహాలు, మౌలిక సదుపాయాలు, రోడ్లు, తాగునీరు వంటివి కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో 18 శాఖలు సంయుక్తంగా ఆయా గిరిజన నివాస ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని తెలిపారు.